705098701

# ప్రబోధ ౨౦

సద్భక్తులందరు భగవంతుడా యంచు
చెవులకింపుగ స్మరణచేయుదినము
బీదలపెతలన్ని ప్రీతితో నెరవేర్చి
అన్నదమ్ముల మాడ్కి మన్నదినము
దైవచింతన చేయు భక్తబృందములకు
ప్రీతి మృష్టాన్నము పెట్టుదినము
మహనీయులెవ్వారైన మనకడకేతెంచి
చెలివి భగవత్కథలు చెప్పుదినము
దినము దినముగాని
తక్కినవన్నియు తద్దినములె
ఇంతకన్నను వేరెద్దియెరుకపరతు
సాధుసద్గుణగణ్యులౌ సభ్యులార.

ప్రేమస్వరూపులారా!

మనసుకు శాంతి అవసరము. శాంతి లేక సుఖము లేదు. అనాదికాలమునుండియూ శాంతి నిమిత్తమై మానవుడు యనేకవిధములైన ప్రయత్నములు సల్పుతూ వచ్చాడు. కాని శాంతిని అందుకోలేకపోతున్నాడు. కారణమేమిటి? శాంతికి మూలాధారమేమిటి? దేనివలన మనసుకు శాంతి యేర్పడును అనే విచారణ చాలా పెడమార్గం పట్టింది. ప్రాకృత సంబంధమైన పంచభూతముల యొక్క సుఖమే మనసునకు శాంతి అనే పెడమార్గములో మానవుడు యీ శాంతి నిమిత్తమై పాటుపడుతూ వచ్చాడు. కనులతో చూడటం, నోటితో మాట్లాడటం, చెవులతో వినటం, యీ మనస్సుతో అనుభవించటం యీవిధమైన పంచేంద్రియముల యొక్క ప్రసాదమే మానసిక శాంతికి మూలకారణమని భావిస్తూ వచ్చాడు. ఈ యింద్రియముల తృప్తి నిమిత్తమై తాను యనేకవిధములైన తప్పుమార్గములను అనుభవిస్తూ వచ్చాడు. ఈ ఆనందము నిమిత్తమై అధర్మముచే, అక్రమముచే అనాచారముచే యీ ఆనందమనుభవించుటకు పూనుకున్నాడు. వ్యక్తి నిమిత్తమై, స్వార్థప్రయోజనముల నిమిత్తమై పరుల శాంతిని దోచుకొనుటకు ప్రయత్నిస్తున్నాడు. ఈ విధమైన ప్రయత్నముల చేత మానవునకుగాని, తన సోదర మానవులకు గాని శాంతి శాంతిసౌఖ్యములు కరువైపోయినవి. ఈవిధమైన వాంఛలవలన అహంకారము, స్వార్థము పెరుగుతూ వచ్చాయి. ఈ అహంకార స్వార్థప్రయోజ

705098702

నములచేత మానవునకు మానవునకు మధ్యనున్న మానవత్వము మట్టిగలిచిపోయింది. ఈ మానవత్వానికి వుండిన సంబంధ బాంధవ్యాలను పూర్తిగా దూరం చేసుకుంటూ వస్తున్నాడు. మానవుని హృదయం పాలసముద్రము వంటిది. అట్టి క్షీరసాగరమునందే భగవంతుడు పవళిస్తాడని పురాణముల యొక్క ప్రమాణము. క్షీరసాగరముగా వుండవలసిన మానవుని హృదయము యీనాడు క్షారసాగరంగా మారిపోతూ వచ్చింది. క్షీరమనగా తెలుపు అని. తెలుపు అనగా సాత్త్విక భావముతో కూడినదే మానవుని హృదయము అని. ఈ సాత్త్విక హృదయమునందు శాంతి ప్రేమ సహనము సానుభూతి యిత్యాది పవిత్రమైన గుణములు వాసము చేస్తుంటాయి. ఈ క్షీరసాగరమునందు తిమింగలములు, మొసళ్లు యింకా యనేకవిధములైన క్రూరమృగములు నివసిస్తూ వున్నాయి. ఈ మకర తిమింగలములే మనయొక్క అహంకార స్వార్థములు. ఈనాడు మానవుని యందు యీ స్వార్థము, అహంకారము హెచ్చుపెరిగిపోయినవి. దేనికైనను ఒక హద్దు వుంటూ వుండాలి.

'న శ్రేయో నియమం వినా' నియమమే లేకపోయిన మానవత్వం నిర్మూలమైపోతుంది. సూర్యచంద్రాదులకు కాని, నక్షత్రములకుగాని, ఋతువులకుగాని కొన్ని కొన్ని హద్దులేర్పరచుకొని వుంటున్నవి. ప్రకృతి యే ఒక హద్దును అనుసరించి భగవంతుని నియమం ప్రకారము తాను జరుగుతూ వస్తున్నది:

క్రమము తప్పక ప్రతిదినంబును భాను
డుదయాస్తమయములనందనేల
క్షణమైన విశ్రాంతి గానక తాపవనుండు
జీవకోటుల బ్రోవవేవనేల
గగనంబునకు కాంతి కైసేయు తారలు
పగలు మాత్రము దాగు భంగియేల.

ఇవన్నీ కూడను తమ తమ క్రమమును అనుసరిస్తూ వస్తున్నవి. పశుపక్ష్యాదులు కూడను తమ తమ క్రమమును ఆచరిస్తూ వస్తున్నవి. తమ తమ యింద్రియములను తమ తమ స్వాధీనమునందుంచుకుంటున్నవి. కానీ పవిత్రమైన మానవుడు, దివ్యమైన మానవ జన్మము, ఉత్కృష్టమైన మానవ జీవితమును తాను ఒక క్రమములో వుంచుకొనలేకపోతున్నాడు. పశుపక్షి మృగాదులకే సంస్కారం లేదు. సంస్కారమే మానవునకు సరైన త్రోవను చూపిస్తుంది. మానవుని వెంటవచ్చినది సంసారము కాదు. సంస్కారమే. అట్టి సంస్కారమును మనమీనాడు కోల్పోతూ వస్తున్నాము. పుట్టిన మృగములంతా యే విధముగా పుట్టెనో అదే విధమైన స్థితిలో మరణిస్తూ వస్తున్నవి. క్రూరముగా పుట్టిన పులి, చిరుత యిత్యాది మృగములకు యెన్ని విధములైన అభ్యాసములు చేయించినప్పటికిని తమ క్రూరగుణమును వదలలేకపోతున్నవి. కాని మానవుడట్లు కాదు. కొన్ని అభ్యాసముల చేతను కొన్ని నియమముల చేతను తాను దుర్గుణములను సద్గుణములుగా మార్చుకోగలడు.

705098703

శ్రేయోహి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే
ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్.

మనం నడచేనడక, మాట్లాడే మాటలు, చెప్పే విషయములు, చేసే పనులు యివన్నీ కూడను కేవలము అభ్యాసముల వల్లనే అభివృద్ధిగాంచుతున్నవి. క్రూరుడుగా పుట్టిన మానవుడు పరమశాంతిస్వరూపుడుగా జీవించటానికి అవకాశముంటుంది. దారులు కొట్టి దోచుకున్న రత్నాకరుడు కూడను వాల్మీకి మహర్షిగా మారుతూ వచ్చాడు. సద్బోధల చేత, సత్ప్రవర్తనల చేత, సత్సంగము చేత మానవుని సంస్కారము అభివృద్ధిగాంచుతుంది. ఈనాడు మానవునికి సత్సంగము అత్యవసరము.

మనము చక్కని ఆరోగ్యము పొందవలెనన్న దీనికి రెండు మార్గములు అనుసరించాలి. శారీరకమైన ఆరోగ్యము మనకు అత్యవసరము. లోపలనున్న మాలిన్యాన్ని బయటకు పంపాలి. బయటనున్న పవిత్రమైన పదార్థములను లోపలికి పంపాలి. అప్పుడే యీ శరీరము ఆరోగ్యాన్ని పొందుతుంది. అదేవిధముగా మానసిక ఆరోగ్యము కూడను అత్యవసరము. ఇక్కడ మనసునందుండిన దుర్గుణములు, దురాలోచనలు, దుష్ప్రవర్తనలు, దుశ్చింతలు అనే మాలిన్యాన్ని మనము బయటకు పంపాలి. సద్గుణములు, సదాచారములు, సత్ప్రవర్తన, సత్సంగము అనే పవిత్రమైన వాటిని లోపలకు చేర్చాలి. ఆగమార్థంతు దేవానాం గమనార్థంతు రాక్షసాం అన్నారు. అనగా ఓ దేవతలారా మాలో ప్రవేశించండి. ఓ రాక్షసులారా నాలో వుండినవారు బయటకు పొండి అనే ప్రయత్నము మనమీనాడు చెయ్యాలి. అదేవిధముగనే హిరణ్యకశిపుని కుమారుడైన ప్రహ్లాదుడు మహాభక్తుడు. తండ్రి హరిద్వేషి. కుమారుడు హరిప్రియుడు. ఈ రెండింటికి సంబంధము యే మాత్రం లేదు. పరస్పర విరుద్ధమైనదానిని అనుభవిస్తూ వచ్చారు. హిరణ్యకశిపుడు దేవుడు లేడని ప్రహ్లాదుడు దేవుడు కలడని. ఎక్కడ గలడనేటువంటి ప్రశ్న. ఇందుగలడందులేడను సందేహము వలదు అని ప్రహ్లాదుని వాదన. హిరణ్యకశిపుడొక స్థంభమును చూపించి యిందులో భగవంతుడున్నాడా అని ప్రశ్నించాడు. కలడని విశ్వసించాడు ప్రహ్లాదుడు. ఆ స్థంభమును బద్దలు చేశాడు హిరణ్యకశిపుడు. నరసింహుడు ప్రయత్నపూర్వకముగా లభించాడు. దీని అంతరార్థమేమిటి? మన దేహమే ఒక స్థంభము. ఈ దేహభ్రాంతిని మనము బద్దలు చేసినప్పుడే అందులో దైవం ఆవిర్భవిస్తాడు. కాదు యీనాడు దేహభ్రాంతిని మనము దినదినము అభివృద్ధిగావించుకుంటూ వస్తున్నాము. ఈ యింద్రియవాంఛలను మనం పోషించుకుంటూ వస్తున్నాము. కాని యిట్టి పరమభక్తుడైన, పరిపూర్ణ విశ్వాసము కల్గిన ప్రహ్లాదుడు హరిని ప్రేమిస్తూ వచ్చాడు. కాని యిటి పరమభక్తుడైన ప్రహ్లాదునికి కుమారుడు పరమ దుర్మార్గుడైనవాడు పుట్టాడు. అతనే విరోచనుడు. ఈ విరోచనుడు నాస్తికుడు. కాని అట్టి నాస్తికుడైన విరోచనునికి పుట్టినవాడే యీనాడు మనం చేసుకున్న పరమ కథానిధి. అతనే బలిచక్రవర్తి. ఈ బలిచక్రవర్తి ప్రహ్లాదుని మనుమడు. బలిచక్రవర్తి పరమధార్మికుడు. ప్రజల యొక్క క్షేమ సంతోషములను తనకంటిరెప్పవలె కాపాడుతూ వచ్చాడు. ప్రజల క్షేమమే తన క్షేమముగా విశ్వసించిన వ్యక్తి. అట్టి ప్రేమ చక్రవర్తియే ఆనాటి రాజు. అతని కాలమంతయు సుభిక్షంగా సాగుతూ వచ్చింది.

ఎన్ని సద్గుణాములు వుండినప్పటికిని మానవునియందు దుర్గుణాములు కూడా ప్రవేశిస్తూ వుంటాయి. ఎక్కడ చూచినప్పటికిని రాజ్యములోపల బలిచక్రవర్తి పేరుప్రతిష్ఠలు పెరుగుతూవచ్చాయి. ఈ కీర్తిప్రతిష్ఠలు అనేకవిధములుగా వ్యాప్తియైన తక్షణామే తనలో అహంకారము ప్రవేశించింది. ఈ అహంకారమే మానవుని అధఃపతనమునకు ఒకరాజబాట. మానవుని అహంకారమునకవకాశములేదు. దేనిని చూచి అహంకారపడుతున్నాడు.

సర్వతః పాణి పాదం తత్సర్వతోక్షి శిరోముఖం
సర్వతః శ్రుతి మల్లోకే సర్వమావృత్య తిష్ఠతి.

సర్వము భగవంతుడే అయినప్పుడు దేనిని చూచి అహంకారము. తాను నిమిత్త మాత్రుడు మాత్రమే. తనది దేహముకాదు. తనది మనసు కాదు. తనది బుద్ధి కాదు. తనయొక్క అంతఃకరణా తనిదికాదు. ఈ సర్వము కూడను ఆత్మయొక్క ప్రతిబింబములే. ఈనాడు మనసు-మనసు-మనసు దీనికి యనేక విధములైన ప్రతిబింబములుంటున్నాయి. వీటినేమనో అంశములని పిలుస్తారు. మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము యీనాలుగు మనసు యొక్క ప్రతిబింబములే. పేరుతో నాల్గువుంటున్నవిగాని అన్నిటియందు మనసు యేకత్వాన్ని ధరించింది. సంకల్ప వికల్పములతో వుండినప్పుడు యిది మనస్సని పిలువబడుతుంది. నిర్ణయాత్మకమైన స్థితికి వచ్చినప్పుడు యిది బుద్ధి అని పిలువబడుతుంది. చింతించే సమయములో దీనికి చిత్తము అని పేరు. వ్యక్తిత్వాన్ని వ్యక్తీకరించే సమయములో దీనినే అహంకారమన్నారు. ఒక బ్రాహ్మణుడుంటాడు. ఆ బ్రాహ్మణుడు ఒక్కడే గాని వంటవానిని వంట బ్రాహ్మణుడని, పూజచేసేవానిని పూజారి బ్రాహ్మణుడని, పంచాంగము చెప్పే బ్రాహ్మణునికి పంచాంగ బ్రాహ్మణుడని అంటారు. ఇవన్నీ వృత్తులను బట్టి వచ్చే పేరులు. అదే విధముగనే ఒకే మనసుకు తమ వృత్తులను బట్టి పేర్లుమారుతూవచ్చాయి. సంకల్పములు చేసే సమయములో దీనికి మనసు అని పేరు. సంకల్పవికల్పాత్మకం మనః అన్నారు. మంచి చెడ్డల యొక్క నిర్ణయములోపల ప్రవేశిస్తుందియీ మనసే. అప్పుడు దీనిని బుద్ధి అన్నారు. నిత్యానిత్యవిషయ పరిశీలనాజ్ఞానము కల్గినది. కనుక నేయిది బుద్ధి అని పిలువబడుతూ వచ్చింది. మానవుని జీవితమంతయు యీనాలిగింటిపైనే ఆధారపడివుంటుంది. అయితే యీమనసు యింద్రియములపైన ఆధారపడివుంటుంది. ఇంద్రియముల భోగ భాగ్యాలను అనుభవించటానికి మనసు యిష్టపడుతుంది. ఈ యింద్రియములు మనసుతో కూడిన జీవితమే సామాన్యమానవత్వము. ఇట్టిమానవత్వమే సుఖదుఃఖములతో కూడిన జీవితము. ఇంద్రియముల యొక్క భోగము వుండినంతకాలము మానవునికి శాంతి శూన్యమే. ఇంద్రియముల ప్రభావము యేమాత్రంలేకుండా దూరంచేసుకున్నప్పుడే వానికి శాంతి. కనుక మొట్టమొదట మనం చూసే చూపులు పవిత్రమైన చూపులుగా వుండాలి. దృశ్యాన్ని చూచి కన్నులు ఆనందిస్తాయి. ఈ ఆనందముచేత మనసుకు శాంతియేర్పడుతుంది అట్లని మనసు ఆశించిన దృశ్యాన్నంతా చూడటానికి ప్రయత్నించరాదు. ఆవిధమైన పెడమార్గం పట్టడం

చేతనే మనసు మాలిన్యంగా మారిపోతుంది. చూడవలసినది ఒక్కటే. ఏకత్వమనే దివ్యత్వాన్ని మనం చూడాలి. అనేకత్వములో వున్న దివ్యత్వమైన యేకత్వాన్ని మనం సందర్శించాలి. ఈ విధమైన దృశ్యాన్ని మనము అభివృద్ధిపరచుకోవాలి. ద్రష్టుడు దేనిని చూచినా దివ్యత్వంగానే చూచాడు. లోపల వెలుపల చూస్తూ సర్వము కూడను దైవత్వముగానే దర్శించాడు.

అలాంటి మానవత్వాన్ని మనం అభివృద్ధిగావించుకునే నిమిత్తమై బలిచక్రవర్తి స్మృతి నిమిత్తమై యీనాడు ఓణం అనే పవిత్రమైన దినము యేర్పడుతూ వచ్చింది. ఓణం అనగా దీనికి మరొక అర్థము నూతన వస్త్రములు ధరించటమని: తెల్లవారి లేచిన తక్షణమే అభ్యంగన స్నానము చేసి నూతన వస్త్రములు ధరించి, టెంకాయ ఆకులు తీసుకొని వచ్చి, కొబ్బరి ఆకులలోపల పాయసం పెట్టి ఆనందముగా భుజించటం ఓణం యొక్క అంతరార్థము. కానీ ఆహార విహారముల తోనే మనయొక్క పర్వదినములను అపవిత్రం గావించరాదు. కారణమేమనగా బలిచక్రవర్తి ప్రజల ప్రీతిని చూరగొన్నాడు. అలాంటి ప్రభువును కోల్పోవటంచేత ప్రజలు చాలా దుఃఖిస్తూ వచ్చారు. తల్లిబిడ్డలను కాపాడుతూ వస్తున్న ప్రభువు వారికి దూరం కావటంచేత ప్రజలు వియోగాన్ని భరించుకోలేకపోయారు. ప్రజలందరు చాలా దుఃఖిస్తూ వచ్చారు. వారి దుఃఖమును చూచి నరాజు యీ బలిచక్రవర్తి ప్రతి సంవత్సరం కూడను మీ నిమిత్తమై నేను వస్తుంటానని ప్రామిస్ చేశాడు. కనుక ప్రజలయొక్క క్షేమాన్ని ప్రజలయొక్క ఆనందాన్ని ప్రజలయొక్క సౌఖ్యాన్ని ఆశించి కోరిన చక్రవర్తి యొక్క దినమే యీనాటి పర్వదినము. ఆనాటి ప్రజలు ఆవిధమైన ప్రభుభక్తి కల్గివుండేవారు. ఆనాటి ప్రభువు కూడను ప్రజల ప్రీతిని చూరగొన్నవారు. ఈనాటి ప్రజలు ప్రభువుల మధ్య యీ విధమైన సన్నిహిత సంబంధ బాంధవ్యములు యెక్కడ చూసినా కన్పించటము లేదు. ఈనాటి ప్రజలు స్వార్థము స్వప్రయోజన నిమిత్తమై అహంకారములో తమ జీవితాన్ని వ్యర్థము గావించుకుంటున్నారు. ఈనాటి ప్రభువులు కూడను తమ స్వార్థము స్వప్రయోజనము నిమిత్తమై తమ స్థానం సంపాదించుకోటానికి ప్రాకులాడుతున్నారు. ప్రభువులయందు గాని ప్రజలయందు గాని స్వార్థం పెచ్చు పెరిగిపోయింది. కనుకనే దైవత్వం శూన్యంగా కనుపిస్తున్నది. దివ్యత్వం లేకపోతే మానవత్వం వ్యర్థమని గుర్తించటానికి ప్రయత్నించాలి. ఇవన్నీ కూడను క్షణభంగురాలు. ఈ క్షణికమైన యింద్రియ సుఖములకై మన జీవితాన్ని వ్యర్థము గావించరాదు. ఈ యింద్రియానందమును యెంత మనము పొందినప్పటికీ అది తనివి తీరేదికాదు. అగ్నిలో కట్టెలు వేయుకొలది అగ్ని మరింతగా ప్రజ్వరిల్లుతుందే గాని ఆరిపోటానికి ప్రయత్నించదు. కనుక వాంఛలు పెరుగుకొలది మరింత వానికి బంధన యేర్పడుండే కాని వానికి మోక్షమనేది కాని, శాంతి కాని చేకూరదు. కనుకనే మనము యీనాడు క్రమక్రమేణా యీ వాంఛలను తగ్గించుకుంటూ రావాలి. ఈ వాంఛలను మనమెంత తగ్గించుకొందుమో అంత శాంతి మనలో యేర్పడుతుంది. Less Luggage more comfort. మన బాధలు, మన కష్టములు, మన దుఃఖములు మన భ్రాంతులచేతనే అభివృద్ధి అవుతున్నాయి. మన అశాంతికి మన కోరికలే

T05098706

మూలకారణము. ఈ కోరికలయొక్క ఫలితమే కర్మలయొక్క ప్రభావము. ఈ కర్మలయొక్క ఫలితమే మనసుఖదుఃఖములు. కనుక మంచికర్మలను మనము ఆచరించాలి. అందువలననే వుపనిషత్తులంతా కూడను తస్మైనమః కర్మణే. కర్మమునకు నేను మొదటు నమస్కారం. మనసుఖదుఃఖములకు దైవం కారకుడు కాడు. కర్మాధికారి నీవు. కర్మఫలప్రదాత దైవము. ఎలాంటి విత్తనము నాటుకొందువో అలాంటి ఫలమే. కనుక నీవు మంచి మొక్కను నాటుకుంటే మంచి ఫలములే వస్తాయి. కనుక మనము పవిత్రమైన కర్మలలో ప్రవేశించాలి.

వ్యక్తి సక్రమమైన మార్గములో నడచినప్పుడే కుటుంబములో శాంతివుంటుంది. ఈ వ్యక్తిత్వము పవిత్రమైనప్పుడే సమాజము పవిత్రమైనదిగా రూపొందుతుంది. ఈ సమాజము పవిత్రమైనప్పుడే మనంయొక్క దేశము పవిత్రముగా మారుతుంది. దేశము పవిత్రముగావుండినప్పుడే యీ ప్రపంచమంతా పవిత్రముగావుంటుంది. కనుక మొట్టమొదట వ్యక్తిత్వమనే దాంట్లో పవిత్రతవుండాలి. ఈ పవిత్రము యెప్పుడు యేర్పడుతుంది. లోపల వున్న మాలిన్యములు రెండు. స్వార్థము, అహంకారము ఈ రెండింటిని మనము వెలుపల పారవేయాలి. కేవలము వెలుపల పారవేసినంత మాత్రమున చాలదు. బయట వున్న ప్రేమ, సహనము, సానుభూతి, పవిత్రాన్ని లోపల చేర్చాలి. జీవితము దివ్యమైన జీవితముగా రూపొందాలి. ఆదర్శవంతమైన రూపముగా మారాలి. మన జీవితం జీవిస్తున్నాము. పశుపక్షిమృగాదుల వలె మనం భుజిస్తున్నాము. పశుపక్షిమృగాదుల వలె మనము యింద్రియములయొక్క ఆనందాన్ని అనుభవిస్తున్నాము. ఎక్కడ మన పవిత్రత. ఎప్పుడు చూచినా పరులను నిందించటము పరులను విమర్శించటము పరులసుఖము చూచి ఓర్వలేక పోవటము. తన సౌఖ్యానికి తను అహంకారము గావున్నత లాగటం యీవిధమైన పశుత్వమే మానవుని అధఃపతనము గావిస్తుంది. మనసునందు ఒకటి మాటయందు మరొకటి. ఇదే మానవత్వాన్ని పూర్తి నిర్మూలంగావిస్తుంది. ఈనాడు మానవత్వముందా. మానవుడుగా వన్పిస్తున్నాడే గాని మానవత్వం శూన్యమైంది. ఎక్కడ కూడా కన్పించటంలేదు. ఎక్కడ చూచినప్పటికీ స్వార్థము, స్వార్థము, స్వార్థము. స్వప్రయోజనము. ఇది ఇతర తరములనుండి వేళ్ళు పాకిపోయినవి. ఈ హృదయములోపల పాతుకొని పోయిన యీ స్వార్థాన్ని పెకి పారవేయాలి. మనకు శాంతము త్యాగమునందే. త్యాగమునందే మనకు ఆనందము. త్యాగమే మనకు అభయము. కారణమేమనగా మనకు ఆశ ఉండినంతవరకు మనకు చాలా బాధలే. చాలా భయమే. త్యాగము చేసినప్పుడు అభయము. ఎట్టి భయము వుండదు. అందువలననే వేదము నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసు అన్నారు. త్యాగములో వుండిన ఆనందము, భోగములో వుండిన దుఃఖము మనము చక్కగా విచారణ చెయ్యాలి. త్యాగములో చేసిన యోగము కూడను ఒక భోగముగా మారుతుంది. కర్మయందు అహంకారము, ఫలమునందాసక్తి యీ రెండూ వదలితే అదే త్యాగము. అదే యోగము. మనం చేసే కర్మలయందు అహంకారాన్ని మనం అభివృద్ధిగావించుకోరాదు. ఇది నేను చేసిన కర్మ దీనిఫలితము నాకు లభించాలి అనే స్వార్థంకూడా వుండకూడదు. నీవు

ఒక చెట్టును నాటవచ్చు. కానీ ఆ ఫలితము నీకే లభిస్తుందనే నమ్మకము యేమిటి? నీవు కొన్ని నెలలో మరణించవచ్చు. కానీ ఆ చెట్టులోని ఫలములు కొన్ని సంవత్సరాలకు నీ మనుమలు, కొడుకులు వచ్చి భుజించవచ్చు. కనుక ఆ ఫలితము నీకే లభించాలని యేమాత్రం శాసనం లేదు. చేయటమే నీ కర్తవ్యము. కర్తవ్యం యోగముచ్యతే. అదే నిజమైన యోగము. కనుక నే మనము పవిత్రమైన కర్తవ్యములు నిర్వర్తించాలి.

అదే బలిచక్రవర్తి చూపిన మహాత్యాగం. గురువైన శుక్రాచార్యుడు బలి చేసే త్యాగాన్ని అడ్డగించాడు. చక్రవర్తీ వచ్చిన వాడు సామాన్యుడు కాడు. సాక్షాత్తూ నారాయణుడే యీ రూపం ధరించి వచ్చాడు. అతను నిన్ను పరీక్షించుటనిమిత్తమై వచ్చాడు. దానికి బలిచక్రవర్తి ఆనందించాడు. గురూజీ సాక్షాత్తు నారాయణమూర్తే నా వద్దకు వచ్చి చేయి చాచినప్పుడు నా చేయి అతని చేయిపైన పెట్టటం నాకు యెంత అదృష్టము అన్నాడు. అదృష్టమనగా అడిగే వాని చేయి క్రింద వుంటుంది. ఇచ్చే వాని చేయి పైన వుంటుంది. కనుక అక్కడ తన త్యాగము ఉన్నత స్థాయిలో వుంది అన్నాడు. కానీ యీ బలిచక్రవర్తి వినే స్థితిలో లేడని గుర్తించాడు శుక్రాచార్యుడు. సూక్ష్మరూపుడై కలశరంధ్రానికి అడ్డు నిలచాడు. సర్వజ్ఞుడైన వామనమూర్తి యీ శుక్రాచార్యుడు చేస్తున్న ట్రిక్ గుర్తించాడు. ఈ చేసే దానానికి అడ్డు తగిలేవాడు మహాపాపి.

తాను పెట్టనున్న తగవు పుట్టదు గాని
ఒరులు పెట్టుట చూచి ఓర్వలేరు
దాత దగ్గర చేరి తనము ల్లిపోయినట్టు
జిహ్వతో చాడిలు చెప్పుచుందు.

ఇట్టివారిని యేమని పిలవాలి అని ప్రశ్నించుకున్నాడు. త్యాగము చేసే వారికి అడ్డు తగిలే వారికి యేమని పిలవాలి అని యోచించుకున్నాడు. భిక్షుక శత్రువు అని పేరు పెట్టవలెనని నిర్ణయించుకున్నాడు. భిక్షుక శత్రువు యెవరు. అన్నం అడుక్కోటానికి పోతాడు. అక్కడ యేదైనా పడితే కాచుకుని వుంటాయి కుక్కలు. కనుక కుక్కలే యీ దానము చేసే వానికి అడ్డు తగిలే వారు. ఈ యుక్తిని గుర్తించిన వామనమూర్తి ఒక చిన్న పుల్ల తీసుకొని పొడిచాడు అడ్డు. అప్పుడు శుక్రాచార్యుని ఒక కన్ను పోయింది. అతని పేరే శుక్రాచార్యుడు. కారణమేమనగా అతడు మహాగురువు. గురువు సర్వధర్మము బోధించేవాడు. సర్వధర్మములు బోధించే గురువు దానమునకడ్డు తగలటం చాలా చెడ్డది కదా. బోధనలో మాత్రం గురువుగా వున్నాడు. ఆచరణలో మాత్రం గుడ్డిగా వున్నాడు. కనుక రెండు విధములైన చర్యలలో తాను పాల్గొంటున్నాడు. చెప్పటం మాత్రం చెబుతున్నాడు కాని చేయటం లేదు. అందువల్లనే A man with a duel mind is half blind అన్నారు. మనం ఒకే mind గా వుండాలి. రెండు విధములైన మనసులుగా వుండరాదు. కనుక మనం చేయవలసినదేదో ఇవ్వవలసినదేదో, చూడవలసినదేదో, చెప్పవలసినదేదో అది హృదయపూర్వకముగా చెయ్యాలి. చక్కగా బుద్ధితో విచారణ చేసి పవిత్రమైనవే చేయాలి. పవిత్రమైనవే నీవు చూడాలి. పవిత్రమై

నవే నీవు చెప్పాలి. భగవంతునికి త్రైఫ యివ్వటానికైనా సిద్ధముగా వుండాలి. అలాంటి సర్వసంగపరిత్యాగి యైనవాడే యీ బలిచక్రవర్తి. తనకు సర్వస్వము వుంది. తనకు యే కొదవా లేదు. సుఖమునందుగాని ధనమునందుగాని, భోగభాగ్యములందుగాని యేవిధమైన కోరిక లేదు. సర్వమూ వుండి త్యాగము రావటం చాలా అదృష్టము. శ్రీమంతులకు త్యాగం రాదు. అలాంటి వారు మరింత పిసినారులుగా మారుతారు. లోభులుగా రూపొందుతారు. కాని బలిచక్రవర్తి త్యాగిగా మారిపోయాడు. ఇలాంటి త్యాగానికే యింత గొప్ప కీర్తి వచ్చింది.

మంచిలో కూడను చెడ్డ పుడుతూ వుంటుంది. వారి వంశమంతా రాక్షస వంశం. రాక్షస వంశములో కూడను ప్రహ్లాదుడు, బలిచక్రవర్తి పరమ భక్తులు జన్మించారు. బురదలో కూడను మంచి మంచి పవిత్రమైన కమలములు పుడుతూ వస్తుంటాయి. నీటియందే మంచి చెడ్డలు వుద్భవిస్తాయి. మనిషిని ఆకర్షించే కమలములు ఉద్భవిస్తాయి. మనిషిని పీల్చిపిప్పి చేసే జలగలు కూడను అందులోనే ఉద్భవిస్తాయి. కనుక మానవుని యందు కూడను పవిత్రులు, అపవిత్రులు కూడా వుంటున్నారు. పవిత్రులు మరింత ఉత్తమోత్తమ పవిత్రులు కావాలి. అపవిత్రులు పవిత్రములోనికి ప్రవేశించాలి. ఇదే ఆదర్శవంతమైన జీవితము. మహనీయుల చరిత్రలన్నియూ కూడను ఒక ఆదర్శాన్ని నిరూపిస్తూ వచ్చాయి. వారు ఆచరించిన ఆచరణలు మనం ఆదర్శముగా తీసుకోవాలి. అలాగే బలిచక్రవర్తి యీరోజు దర్శనమిచ్చిన రోజని, వామనమూర్తి అవతారమెత్తిన దినమని మనము యేదో పండుగలు చేసుకున్నంత మాత్రమున ప్రయోజనము లేదు. వామనమూర్తి యొక్క పవిత్రమైన గుణములు, పవిత్రమైన బలిచక్రవర్తి యొక్క త్యాగము మనలో ఆవిర్భవించాలి. ఆవిధముగా ఆవిర్భవించినప్పుడే ఆ ప్రభువుకు, ప్రజలకు సన్నిహిత సంబంధ బాంధవ్యమేర్పడిపోతుంది. అలాంటి ప్రభువులు, అలాంటి ప్రజలు ఆనాడు జగత్తులో వుండేటువంటివారు. కాని యీనాటి మానవుని దృష్టి మంచిని చెడ్డగా చెడ్డను మంచిగా భావిస్తుంటారు. ఒక చిన్నకథ

మహారాజు ఒకనాడు అభ్యంగనస్నానం ఆచరించాలని సంకల్పించుకున్నాడు. మహారాజు సర్వకార్యములు కూడను మహారాణియే చేసేటువంటిది ఆరోజులలో. ఈనాటి శ్రీమంతులంతా టేబుల్ ముందు కూర్చుంటే వంటవాళ్ళే వచ్చి వడ్డించాలి. భార్య ముట్టుకోదు. కాని ఆనాడు భార్యనే భర్తను వడ్డించాలి. రాణి అయినా కూడను రాజుకు తానే కాలుల బెయ్యాలి. ఆనాడు రాణి యింత తైలము వాడేతిలోనికి తీసుకుని మహారాజుకు అభ్యంగనస్నానము ఆచరించేనిమిత్తము తల అంటుతూ వుంది. ఆమె తల అంటుతూ వుంటే తలలో పలయొక్క రెండు తెల్ల వెంట్రుకలు కన్పించాయి ఆమెకు. ఆమెకు విచారం అధికమైపోయింది. రాజుగారు వృద్ధులౌతున్నారు. జీవితము దినదినమునకు తరిగిపోతోంది. క్షణక్షణము నతూయిూ దేహప్రమాణ మనేది తరిగిపోతోంది అని తలంటుతూ తాను కంటినీరు తుడుచుకుంటూ వుంది. ఈ మహారాజుగారి గృహము చుట్టూ అద్దాలతో వుండేవి ఆనాటి రాజమందిరాలు

705098709

తలంటుకుంటున్న రాజు ఆమె కంటి నీరు తుడుచుకోటం అద్దములో చూచాడు. అప్పుడు ప్రశ్నించాడు రాజు ఎందుకు నీవు కంటి ధారలు కారుస్తున్నావని. ఆమె చెప్పటానికి యేమాత్రం ధైర్యం లేక తాను కొంత సందేహిస్తూ వచ్చింది. కడపటికి రాజు యొక్క వత్తిడి చేత ఆమె చెప్పింది. తమకు దిన దినమునకు వయసు పెరిగి పోతున్నది. ఇంతకాలము జీవిస్తిమి మనము యీ జగత్తులో పలని తమ యొక్క జీవితము నిమిత్తమై నేను యోచించాను అన్నది. ఈ విషయం తెల్సిన తక్షణమే రాజుకు కూడా తీవ్రమైన వైరాగ్యము పుట్టింది. ఎంత కాలం మనము విధముగా భోగభాగ్యాలలో జీవించటం. తినటము, తిరగటము, నిద్రించటము, అనుభవించటము యింతేనా మన జీవిత లక్ష్యము. చాలు చాలు యింక మన జీవితానికి. యింక మిగిలిన శేష జీవితాన్ని దైవ చింతనతో మనము సార్థకము చేసుకుందామనుకున్నాడు. ఇద్దరు అప్పటికప్పుడే అనుకున్నారు. మంత్రులను పిలిపించారు. రాజ్యము వారికి అప్పజెప్పారు. ఇద్దరూ అరణ్యానికి వెళ్లారు. ఇరువురూ పోయేటప్పటికి ప్రజలు యిలాంటి పవిత్రమైన రాజులు మాకు చిక్కరు ఇలాంటి రాజులనంతా మనము దూరము చేసుకుంటున్నామే అని వారు కూడను అరణ్యానికి వెళ్లారు ప్రార్థించారు రాజును మీరు లేకపోతే మేము ఆ రాజ్యములో జీవించలేమని ప్రజలు చాలా మొరపెట్టుకున్నారు. ఎందుకోసం మీరు రాజ్యం వదిలిపెట్టి వచ్చారు ప్రజలపైన యేమైనా విరక్తి కలిగిందా, ప్రజ ఎవరైనా మిమ్మల్ని బాధపెట్టారా ప్రజ ఎవరైనా మిమ్మును నిందించారా దానికి కారణం చెప్పమని ప్రార్థించారు. మహారాజు అతి శాంతముతో ప్రేమతో ప్రజలను దగ్గరకు పిలిచి నాయనా! యేదో కొంతకాలము మిమ్మల్ని యేలినాము. మిమ్మల్ని అన్ని విధాలా ఆదరించాము. నా కర్తవ్యము నిర్వర్తించుకున్నాను. శేష జీవితాన్ని దైవ ప్రార్థనతో సార్థకం చేసుకోవాలని అన్నాడు. ఇంకా యెంత కాలము బ్రతకగలను. యెప్పుడో యేమో. ఈ శరీరము దిన దినమునకు కృశించి పోతోంది. ఈ మాట వినేటప్పటికి ఒకసారి గొల్లున యేడ్చారు. ఆ ప్రజలు కూడను ఒక వైపునకు పోయి తపస్సు చేస్తూ కూర్చున్నారు. ఒకనాడు బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు ప్రజలకు. ప్రజలారా మీకేమి కావాలని ప్రశ్నించాడు. స్వార్థరహితమైన ప్రజలా నాడు స్వామి! మా రాజుకు దీర్ఘాయువు అనుగ్రహించండి అని ప్రార్థించారు. తథాస్తు అన్నాడు బ్రహ్మ. ఆ ప్రజలు గంతులు వేసుకుంటూ వెళ్లి మహారాజుకు చెప్పారు. మీకు యింకా యెంతో ఆయువు అందించాడు బ్రహ్మ. మీరు చిరంజీవిగా వుంటారు. దీర్ఘాయుష్మంతులుగా వుంటారు. కాబట్టి మీరు రాజ్యానికి రావాలి అని ప్రార్థించారు. రాజు బయలుదేరాడు. రాజ్యానికి వస్తున్నాడు. కాని రాణి నేను రాను నేను యిక్కడే వుంటాను అంది. అప్పుడు ప్రజలు కొంత తప్పు అర్థము చేసుకున్నారు. మేము బ్రహ్మను మా మహారాజు దీర్ఘాయుష్మంతుడు కావాలని అడిగాము కాని మహారాణికి మేము అడగలేదు. అందువలన ఆమెకు కోపం వచ్చిందేమోనని భావించారు. ఆ రాణి అటువంటిది కాదు విశాలమైన హృదయము కలది. సరే! మాకు రాజు కదా ప్రధానమనుకున్నారు ప్రజలు రాజు వచ్చారు. ఆమె తపస్సు దీర్ఘంగా చేసింది. ఆమెకు కూడా బ్రహ్మ ప్రత్యక్షమయ్యాడు. అమ్మా నీవు దేనిని ఆశిస్తున్నా

వునీకేమికావాలి అని ప్రశ్నించాడు. స్వామీ మీరు రాజుకు దీర్ఘాయువు ఇచ్చినది నిజమేనా, రాజుమాత్రం దీర్ఘాయువుగా వుండి రాజును ప్రేమించే ప్రజలకు దీర్ఘాయువు లేకపోతే అలాంటి రాజు వుండి ప్రయోజనమేమిటి కనుక నా ప్రజలకు కూడా దీర్ఘాయువు అనుగ్రహించండి అంది. ప్రజలు పవిత్రులైనవారుగా వుండినప్పుడే ప్రభువు కూడను పవిత్రుడు, దీర్ఘాయువుగా వుండాలి ప్రజలకు లేని దీర్ఘాయువు రాజుకుండి ప్రయోజనమేమిటి? ప్రజలు ప్రభువు దీర్ఘాయులుగా వుండాలని ఆశీర్వదించమని కోరింది. అప్పుడు యీమె చేసిన త్యాగానికి బహ్మ ప్రభువు, ప్రజలు, నీవు దీర్ఘాయుష్మంతులై వుందురుగాక అని ఆశీర్వదించాడు. మనము త్యాగము చేయుకొలది మనకు భోగములు మరితఅధికమవుతూ వస్తాయి. ఏ భోగములు? దివ్యమైన భోగములు. అదే మనయొక్క జన్మము. శృణ్వంతుపుత్రే అమృతస్యపుత్రాః. మనం అమృతపుత్రులు కావాలి. అనృతపుత్రులు కాకూడదు. మన హృదయాన్ని క్షీరసాగరంగా మార్చుకోవాలి. క్షారసాగరంగా మార్చుకోరాదు. విశాలమైన హృదయంగా మనము అభివృద్ధిపరచుకోవాలి. సంకుచితభావాలు చేర్చుకోరాదు. అప్పుడే నారాయణుడు మన హృదయంలో నివాసం చేస్తాడు. అతనినే క్షీరసాగరశయనుడు అన్నారు. క్షీరసాగరుడంటే యేమిటి? నీయొక్క పవిత్రమైన హృదయములో తాను పవళించి వుంటున్నాడు అతనే మహావిష్ణువు.

భగవంతుని నివాసమైన యీ మనసును అపవిత్రమైన దుర్గుణాలకు నివాసం చేసుకోటం యెంతటి అపవిత్రము. ఈ దుష్టగుణములను, దుష్టభావములను దుష్టసంకల్పములను మనము తుడిచి పారవేయాలి. పవిత్రమైన భావాల్ని చేర్చుకోవాలి. నిస్వార్థమైన ప్రేమను నింపుకోవాలి. నిర్మలమైన భావాన్ని పెంచుకోవాలి. మన జీవితాన్ని భగవంతునికి త్యాగం చేయాలి. అదే యీ బలి చక్రవర్తి చేసిన పవిత్రమైన కర్మ. నాటి మొదలు నేటివరకు కేరళ రాజ్యములోపల యీ పవిత్రమైన భావములచేత, ఉత్తేజమైన భక్తిశ్రద్ధలచేత యీ పండుగ ఆదరిస్తూ వస్తున్నారు.

కేరళదేశం చాలా పవిత్రమైనది. ప్రకృతి సౌందర్యముతో తులతూగుతుండేది. నిరంతరము కళకళలాడుతూ కిలకిలనవ్వుతుండేది. ఈ ప్రకృతి సౌందర్యమంతా పచ్చనితోరణంగా వుంటుండి. ఎక్కడ చూచినప్పటికి చాలా సౌందర్యమైన ప్రకృతిగా రూపొందుతుంది. ఆ సౌందర్యమనేది భగవంతుని స్వరూపము. కనుక God is beauty, Beauty is God అందువల్లనే కేరళ రాజ్యములోపల మూడు అవతారములొచ్చినవి. భగవంతుడు సాక్షాత్తు అవతరించటానికి అది ఒక పవిత్రస్థానము. ఇలాంటి పవిత్రమైన స్థానములను మనము పవిత్రమైన భావములతో సార్థకం గావించాలి. కేరళలోపల భక్తిప్రపత్తులు చాలా మెండు. రాజకీయమార్గములో కొన్ని అటూ యిటూ మార్పులు వచ్చినప్పటికిని ప్రతివ్యక్తియందు ఒక దివ్యమైన భావం వారిలో ఆవిర్భవిస్తూ వుంటాయి. సంస్కృతికి సంస్కారమునకు పుట్టినిల్లు కేరళ. ఏదో కొంతమంది వుండవచ్చును. కానీ కేరళలోపల ఆధ్యాత్మిక చిత్తమనేది వారియొక్క స్వభావము. ఎలాంటి నాస్తికుడైనా కూడను యేదో తనకు తెలియకుండానే దైవాన్ని అనుకొంటూ వుంటాడు. ఈ విధముగా దైవాన్ని

705098711

స్మరిస్తూవుంటాడు. బయట దైవము లేడని ఉద్ధరిస్తూవుంటాడు కాని లోపల దైవాన్ని చింతిస్తూవుంటాడు
కనుక కేరళరాజ్యము యిలాంటి పవిత్రమైన ఆధ్యాత్మికశక్తి చేతను వాతావరణము చేతను కూడిన
క్షేత్రము. కాని రాజకీయ మాలిన్యము చేత క్రమక్రమేణా యిలాంటి పవిత్రతంతా దిగజారిపోతోంది.
కాని కేరళప్రజలు అనాదికాలము నుండి అభివృద్ధి గావించుకొన్న ఆధ్యాత్మికతత్వాన్ని మీరు అభివృద్ధి
చేసుకుంటూరావాలి. ఎట్టి పరిస్థితులయందైనా మీ విశ్వాసము కోల్పోరాదు. అది తరతరములనుం
డివచ్చిన సాంప్రదాయము. అదే సంస్కారము. అదే మనయొక్క పవిత్రమైన ధనము. ఆ ధనము తరిగే
టువంటిది కాదు. ఆ ధనము కరిగేది కాదు. క్రమక్రమేణా పెరిగేది. కేరళ ప్రజలారా! మీరు యీ
ఆధ్యాత్మిక చింతను క్రమక్రమేణా అభివృద్ధి గావించుకొని ప్రచార ప్రబోధల చేత సర్వులకు ఆద
ర్శాన్ని అందిస్తూ ఆనందించాలని ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.